క్లుప్తంగా

బైకులు ఢీకొని ఒకరికి గాయాలు

మద్దిపాడు: మద్దిపాడులోని జగనన్న కాలనీకి వెళ్లే సర్వీస్ రోడ్డులో ఆదివారం ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొని ఆలపాటి శ్రీకాంత్ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించినట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ముస్లింలకు శిద్దా రంజాన్ శుభాకాంక్షలు

ఒంగోలు వన్‌టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు రంజాన్ మాసం అంతా కఠోర ఉపవాసాలతో, దైవ ప్రార్థలతో గడపడమే కాకుండా పేదలకు సాయం చేస్తూ భక్తిశ్రద్ధలతో రంజాన్ జరుపుకోవడం మంచి విషయమని ఆయన అన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసన



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

అల్లూరు (కొత్తపట్నం): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా కొత్తపట్నం మండల క్రైస్తవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అల్లూరు గ్రామంలో ఆదివారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులతో అంబేడ్కర్ కాలనీ, బస్టాండ్ సెంటర్ మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నిమిషం పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతికి కారుకులైన హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని, వారికి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు జ్ఞానరాజు, రంగయ్య, ప్రశాంత్, నరేష్, ప్రసాద్, దాపరాజ్ దిలీప్, నరేంద్ర, యేసేబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల నిర్వీర్యమే లక్ష్యంగా..

కూటమి కుట్ర

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ నిలిపివేసింది. చివరకు సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలకు సైతం మంగళం పాడింది. ప్రస్తుతం ఏకంగా సచివాలయాల సంఖ్యనే తగ్గించి వాటి సేవలను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలకు తెరతీసింది. ముందుగా రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తారని, అనంతరం విలీనం చేస్తారని పలు రకాల వార్తలు వినిపిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది.

- క్లస్టర్లు, విలీనం పేరుతో సచివాలయాల సంఖ్య కుదింపునకు సన్నాహాలు
- ఇప్పటికే సచివాలయాల ద్వారా అనేక సేవలు నిలిపివేత
- తాజాగా సచివాలయాల సంఖ్య కూడా తగ్గించేందుకు కుట్రలు
- కసరత్తులో నిమగ్నమైన అధికారులు
- సంతనూతలపాడు మండలంలో 15 నుంచి 7కు తగ్గనున్న సచివాలయాలు
- ప్రజలకు పూర్తిగా దూరం కానున్న సేవలు

సంతనూతలపాడు: జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. 2 వేల జనాభాకు ఒక్క సచివాలయం చొప్పున ఏర్పాటు చేసి గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలన్నీ అందుబాటులోకి తెచ్చారు. ఈ వ్యవస్థను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకురావడంతో ఆ పార్టీకి పేరొస్తుందన్న ఉద్దేశంతో వాటిని నిర్వీర్యం చేయడానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. అందులో భాగంగా సచివాలయాలను విలీనం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది.



సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరు గ్రామ సచివాలయం

కూటమి తీరుతో ప్రజలకు మరింత దూరం కానున్న సచివాలయాల సేవలు...

సచివాలయాలను విలీనం చేసి వాటి సంఖ్య తగ్గించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సచివాలయాల సేవలు ప్రజలకు మరింత దూరం కానున్నాయి. ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు పొందే అవకాశం ఇక ఉండదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. 2019కి ముందు మాదిరిగా పనుల కోసం వేరే ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితులు త్వరలో ఏర్పడతాయని తెలుస్తోంది. అరకొరగా ఉండే సచివాలయాలు, వాటి సేవల కోసం రానున్న రోజుల్లో ప్రజలు తమ పనులు మానుకుని వెళ్లి అక్కడి సిబ్బంది కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులను తలచుకుని అప్పుడే ప్రజల్లో భయాందోళన మొదలైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంట్లోనే ఉండి వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ద్వారా అన్ని పనులు చేయించుకుని తీరిగ్గా ఉండేవాళ్లమని ప్రజలు, రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

సంతనూతలపాడు మండలంలో ఇదీ పరిస్థితి...

సంతనూతలపాడు మండలంలో మొత్తం 18 పంచాయతీలు ఉండగా, వాటి పరిధిలో 15 సచివాలయాలు సేవలందిస్తున్నాయి. వీటిలో సుమారు 132 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం సంతనూతలపాడు, సంతనూతలపాడు-2, ఎండ్లూరు, మైనంపాడు, రుద్రవరం, గురవారెడ్డిపాలెం, పి.గుడిపాడు, చంద్రపాలెం, పి.తక్కెళ్లపాడు, గుమ్మలంపాడు, ఎనికపాడు, చిలకపాడు, మంగమూరు, మద్దులూరు, వేములపాడులో సచివాలయాలను ఏర్పాటు చేసింది. రూ.40 లక్షల వ్యయంతో సొంత భవనాల నిర్మాణం కూడా చేపట్టింది. ఒక్కో సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వీఆర్వో, కార్యదర్శి, అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, మహిళా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మండలంలో దాదాపు ఎనిమిది సచివాలయాలు కనుమరుగయ్యే అవకాశం ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ఆయా గ్రామ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. లక్షలు వెచ్చించి నిర్మించిన సచివాలయ భవనాలు కూడా నిరుపయోగంగా మారే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.

సచివాలయాల విలీనానికి కసరత్తు చేస్తున్న అధికారులు...

గ్రామ స్థాయి ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడమే కాకుండా దాదాపు 530 రకాల సేవలను వాటి ద్వారా అందించింది. కానీ, నేటి కూటమి ప్రభుత్వ నిర్ణయాల కారణంగా పల్లె ముంగిట ప్రభుత్వ సేవలు దూరం కానున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సచివాలయాలను కలిపి ఒక సచివాలయంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కసరత్తు ఇప్పటికే పూర్తిచేసినట్లు తెలుస్తోంది. సచివాలయాల కుదింపు ఎలా చేయాలనే దానిపై ఎంపీడీఓలు, కార్యదర్శులు విస్తృతంగా సంప్రదింపులు జరిపి ఉన్నతాధికారులకు నివేదికలు కూడా పంపించినట్లు సమాచారం.

విలీనంపై కసరత్తు చేస్తున్నాం

సంతనూతలపాడు మండలంలో 15 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వాటిని కుదించడానికి కసరత్తు చేస్తున్నాం. అందులో భాగంగా 15 గ్రామ సచివాలయాలను 7 నుంచి 8 గ్రామ సచివాలయాలుగా ఏర్పాటు చేయడానికి నివేదికలు రూపొందిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూపొందిస్తున్న ఈ నివేదికల మేరకు ఏయే గ్రామ సచివాలయాలు ఉంటాయో త్వరలోనే ప్రకటిస్తాం.

– డి.సురేష్‌బాబు, ఎంపీడీఓ, సంతనూతలపాడు

సచివాలయాల విలీనం ప్రక్రియను విరమించుకోవాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందించేందుకు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసింది. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి సచివాలయాలకు అనుసంధానం చేసి ఇంటి వద్దకే సేవలు అందించింది. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయాల సంఖ్య తగ్గించాలని చూస్తోందని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. అలా జరిగితే ప్రజలకు సేవలు కూడా నిలిచిపోయి పనుల కోసం పక్క గ్రామాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుంది. అందువలన విలీనం నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకుంటే మంచిది.

– తన్నీరు ఆంజనేయులు, సంతనూతలపాడు

ప్రతి కార్యకర్త సైనికుడిలా తయారు కావాలి



గుమ్మళ్లపాలెం గ్రామ కమిటీతో లంకపోతు అంజిరెడ్డి, ఆళ్ల రవీంద్రారెడ్డి

- వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపు

కొత్తపట్నం: ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త సైనికుడిలా తయారై రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గుమ్మళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, రాజుపాలెం గ్రామాల్లో పార్టీ గ్రామ కమిటీలను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి గ్రామ కమిటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కమిటీలో ఉన్న ప్రతిఒక్కరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేందుకు మీ అందరి కృషి అవసరమన్నారు. వైఎస్సార్ సీపీని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. మన ప్రభుత్వం పరిపాలించినప్పుడు హామీలన్నీ నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలు మరిచిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టాల్సిన సమయం ఆసన్నమైందని, మనమంతా ఐక్యంగా పోరాటం చేయాలని నాయకులు, కార్యకర్తలకు లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, రంగాయపాలెం సర్పంచ్ భర్త గాలి ముసలారెడ్డి, వజ్జిరెడ్డిపాలెం సర్పంచ్ బద్దేల జాలిరెడ్డి, రాజుపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరరావు, తాతా నాంచార్లు, తాతా శ్రీనివాసరావు, తుళ్లూరి వెంకటనారాయణ, సుబ్రహ్మణ్యం, దోనెపూడి రవి, వెంకటకృష్ణ, జిలాని, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

చుండూరు రవిబాబును కలిసిన రొండా అంజిరెడ్డి



చుండూరు రవిబాబుతో రొండా అంజిరెడ్డి, భూమిరెడ్డి రమణమ్మ, తదితర నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఇంటలెక్చువల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన రొండా అంజిరెడ్డి ఆదివారం ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకారం అందించిన రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వీఆర్సీ రెడ్డి, దాసరి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉగాది పండుగ సందర్భంగా చుండూరు రవిబాబును భూమిరెడ్డి రమణమ్మ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు బడుగు ఇందిర, సాధం విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులోని నెహ్రూకాలనీలో కనకదుర్గమ్మ దేవస్థానంలో బారులుదీరిన భక్తులు



నాగులుప్పలపాడు : ఉగాది సందర్భంగా విద్యుత్ వెలుగులతో ఆలయాలు



నాగులుప్పలపాడు : పంచాంగ పఠనం చేస్తున్న పండితులు

ఘనంగా ఉగాది వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- మార్మోగిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణాలు

ఒంగోలు మెట్రో: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. వేదపురోహితులచే పంచాంగ శ్రవణాలు ఏర్పాటు చేశారు. ఒంగోలులోని కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రముఖ వేద పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి పంచాంగ పఠనం చేశారు. ఒంగోలు బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో వేద పురోహితులు సదాశివయ్య, మంగమూరుడొంక మర్రిచెట్లకాలనీ పొలిమేర అభయాంజనేయస్వామి దేవస్థానంలో ములుగుట్ల శ్రీరామచంద్రమూర్తి, కేశవస్వామిపేటలోని లలితాపీఠంలో, స్వయంపాకుల కోటేశ్వరశర్మ, రాజీవ్‌నగర్ బ్రాహ్మణ వృద్ధాశ్రమంలో, జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి అగస్త్య రాజుశివ పంచాంగ శ్రవణం చేశారు. లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో, మంగమూరు రోడ్డు హరిహరసుత అయ్యప్ప క్షేత్రంలో, నగరంలోని ప్రముఖ ఆలయాల్లో ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. తెలుగు కొత్త సంవత్సరం ఉగాది సందర్భంగా ఆలయాలకు భక్తులు భారీగా చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొప్పోలులోని చెన్నకేశవస్వామి ఆలయంలో 7 కేజీల చందనంతో స్వామివారి మూలవిరాట్టును అలంకరించారు.



కొప్పోలు చెన్నకేశవస్వామి ఆలయంలో చందనం అలంకారం



శ్రీగిరిలో పంచాంగ పఠనం చేస్తున్న మఠంపల్లి దక్షిణామూర్తి



పంచాంగ పఠనం చేస్తున్న పరాంకుశం కేశవాచార్యులు



నాగులుప్పలపాడు : అమ్మవారికి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

జిల్లావాసులకు ఉగాది పురస్కారాలు...

జిల్లాకు చెందిన నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, ప్రముఖ కవి, కళామిత్రమండలి, తెలుగు లోగిలి సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, ఆలిండియా కళారంగ పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు చల్లా నాగేశ్వరమ్మ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాలు అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం జరిగిన సభలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

సంతనూతలపాడు మండలంలో వైభవంగా ఉగాది వేడుకలు...

సంతనూతలపాడు: ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతనూతలపాడులోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో, శివాలయంలో, చెన్నకేశవస్వామి ఆలయంలో, పెద్ద బజారులోని సీతారామస్వామి ఆలయంలో, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గల సీతారాముల ఆలయంలో, కోదండ రామస్వామి ఆలయం, పేర్నమిట్టలోని చెన్నకేశవస్వామి, రామలింగేశ్వరస్వామి, మైనంపాడు, చిలకపాడు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఉగాది పచ్చడి, ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు పి.అజయ్‌బాబు, ఎస్.బుజ్జిబాబుశర్మ, పి.చక్రాచార్యులు, దివి రమణాచార్యులు, నేలబట్ల శ్రీనివాసరావు, గూడా శివరామకృష్ణ, సాయిరాం, వి.నాగసాయికృష్ణశర్మ, తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు బారులుదీరారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అర్చకులు పంచాగం చదివి వినిపించారు. ప్రతి ఇంట్లో ఉగాది పచ్చడి చేసి సేవించారు. ఏడాది అంతా మంచి జరగాలంటూ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉప్పుగుండూరులో ఆనవాయితీగా పోలేరమ్మ తల్లికి ఉత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో శనివారం రాత్రి ఎడ్ల బండిపై విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి ఊరేగించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేకంగా పొంగళ్లు ఏర్పాటు చేశారు. వివిధ దేవస్థానాల్లో ప్రత్యేక పూజల అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. చదలవాడ శ్రీ రఘునాయకస్వామి దేవస్థానంలో ఈవో అనీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు.

డేవిడ్ సేవలు అభినందనీయం

చీమకుర్తి: చీమకుర్తికి చెందిన రిటైర్డ్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు బండ్ల డేవిడ్ విద్యారంగంలో అందించిన సేవలు అభినందనీయమని ఏపీ రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, మాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకులు కొనియాడారు. టంగుటూరులో ఆదివారం నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉగాది పురస్కారానికి డేవిడ్‌ను ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. విద్యారంగంలో డేవిడ్ అందించిన సేవలతో పాటు సామాజిక రంగంలో అందిస్తున్న సేవా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆయనకు అంబేడ్కర్ ఉగాది పురస్కారాన్ని అందించినట్లు రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, మాల ఉద్యోగుల సంఘ నాయకులు దాసరి చెన్నకేశవులు, టీ అశోక్‌బాబు తెలిపారు.

నిరుపేదలకు రంజాన్ తోఫా

ఒంగోలు వన్‌టౌన్: రంజాన్ సందర్భంగా నిరుపేదలకు మన్‌హా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ తోఫా అందించారు. ఒంగోలు నగరంలోని కొప్పోలు మసీద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌కే శ్రీను బాషా, ఎస్‌కే ఆయేషా, ఎస్‌కే మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అన్నదాతలను సన్మానించిన గ్రామస్తులు



అన్నదాతలను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు, ప్రజలు

చీమకుర్తి రూరల్: శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం మండలంలోని దేవరపాలెం గ్రామంలో ఎడ్లతో వ్యవసాయం చేస్తున్న రైతులను స్థానిక ప్రజలు శాలువాలతో సత్కరించారు. అంతరించిపోతున్న వ్యవసాయ పద్ధతులను గుర్తుచేసుకున్నారు. రైతులు సింగరాజు వెంకటరావు, యు.రాములు ఇప్పటికీ ఎడ్లతో వ్యవసాయం చేస్తుండటంతో గ్రామస్తులు, సంఘ పెద్దలు వారిని సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో రాజశేఖరరెడ్డి, నారాయణ, రాముడు, నాగేశ్వరరావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి దుస్తుల బహూకరణ



సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, తొర్రగుడిపాడు గ్రామ సర్పంచ్ అంజమ్మ ఆదివారం ఎంపీపీ నివాసంలో నూతన దుస్తులు బహూకరించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్లు, బోర్ మెకానిక్‌లు, నైట్ వాచ్‌మెన్లు, స్వీపర్లకు నూతన వస్త్రాలు బహూకరించినట్లు ఎంపీపీ, సర్పంచ్ తెలిపారు.

జాళ్లపాలెం తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

సంతనూతలపాడు: జాళ్లపాలెం బ్రహ్మంగారి తిరునాళ్లకు ఒంగోలు నుంచి సంతనూతలపాడు మీదుగా 26 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఒంగోలు ఆర్టీసీ డిపో అధికారులు తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేశారు. సంతనూతలపాడుకు చెందిన నెట్ సెంటర్ యజమాని కారంశెట్టి చెన్నకేశవరావు స్వచ్ఛందంగా ప్రయాణికుల సౌకర్యార్థం కూలింగ్ వాటర్ ఏర్పాటు చేశారు. సంతనూతలపాడులో ఏర్పాటు చేసిన ప్రత్యేక పాయింట్‌ను ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ డి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో అసిస్టెంట్ మేనేజర్ ఎల్.కోటేశ్వరరావు, తదితరులు పర్యవేక్షించారు.



ప్రత్యేక బస్సుల్లో బ్రహ్మంగారి తిరునాళ్లకు వెళ్తున్న ప్రజలు